క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల దత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆది దంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణానికి కొత్తకోట, కానాయపల్లి, పాలెం, నిర్వేన్ గ్రామాల భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

అయ్యప్పస్వామి పడిపూజ



ఆత్మకూర్: పట్టణంలోని అయ్యప్ప క్షేత్రంలో మంగళవారం అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి, భక్తిగేయాలను ఆలపించారు. అనంతరం సిరాజ్అహ్మద్, అనీస్, ఖాజపాష, లైక్పాష ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మక్బూల్, బట్టపాష, గురుస్వాములు శ్రీనివాస్, రఘు, గాడిలక్ష్మణ్, తోటరవి, దీక్షపరులు, భక్తులు పాల్గొన్నారు.

రామన్‌పాడుకు బస్సు నడిపించండి



మదనాపురం: మండలంలోని రామన్‌పాడు గ్రామానికి ఆర్టీసీ బస్సును నడిపించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు ఎండీ అంజాద్అలీ వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి బస్సు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8:30కు, సాయంత్రం 5 గంటలకు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా.. ప్రజల సౌకర్యార్థం ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం మూడు గంటలకు ఇలా నాలుగు ట్రిప్పుల బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఎండీ ఖదీర్, సురేందర్ గౌడ్ పాల్గొన్నారు.

భగీరథ జనకల్యాణ్ యాత్రకు స్వాగతం



కొత్తకోట: భగీరథ జన కళ్యాణ్ యాత్రకు మంగళవారం పట్టణంలోని భగీరథ చౌరస్తాలో స్థానిక సగర సంఘం నాయకులతో పాటు జిల్లా సగర సంఘం అధ్యక్షుడు తిరుపతయ్య స్వాగతం పలికారు. సెప్టెంబర్‌లో కర్ణాటక నుంచి ప్రారంభమైన యాత్ర 2024 ఫిబ్రవరి 28న ఢిల్లీలో ముగిస్తుందన్నారు. ఫిబ్రవరి 29న ఢిల్లీ రాంలీల మైదానంలో దేశస్థాయి సగరుల భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు యాత్ర నిర్వాహకుడు హరీష్‌చౌహాన్ అన్నారు. చట్టసభల్లో సగరులకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుచ్చన్నసాగర్, సురేష్‌సాగర్, నరేంద్రసాగర్, రాములుసాగర్, జనార్ధన్‌సాగర్, బాలశివుడుసాగర్, అంజన్నసాగర్ ఉన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం



ఖిల్లాఘనపురం: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని సర్పంచ్ బాలాంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని మల్కాపురం, షాపురంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని లబ్ధిదారులకు, ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సందేశాన్ని వినిపించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలకు గ్రామాలకు చేరే విధంగా అందరూ కృషి చేయాలని కోరారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని కోరారు.

గుట్టలను తవ్వేస్తుండ్రు!

- నిరంతరం కొనసాగుతున్న మట్టి మాఫియా
- అక్రమార్కులను సంప్రదిస్తున్న రియల్ వ్యాపారులు
- నేలకొరుగుతున్న వేలాది చెట్లు



తాటిపాముల శివారు గుట్ట నుంచి..



వెంకటపురం గుట్టలోంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు (ఫైల్)

పెబ్బేరు రూరల్: ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు కొండలు, గుట్టలు, కాల్వల వెంట ఉన్న మట్టిని కొల్లగొడుతున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే యజమానులకు మట్టి కావాల్సి వస్తే కోర్రీలు వేసే అధికారులు.. రాత్రి, పగలు తేడా లేకుండా అక్కమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. మట్టి అక్రమ తరలింపును అరికట్టాల్సిన మైనింగ్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. ఉమ్మడి పెబ్బేరు మండలంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారుల వెంచర్లకు, గృహ, వ్యాపార సముదాయాలు నిర్మించే సమయంలో మట్టికి డిమాండ్ బాగా ఏర్పడుతుంది. దూరాన్ని బట్టి టిప్పర్‌కు రూ.2,500 నుంచి 10 వేలు, ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.500 నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. మట్టి తరలించాలంటే గనులు, భూగర్భశాఖకు ట్రిప్పుకు రాయల్టీ చెల్లించి అనుమతి పొందాలి. కానీ అక్రమార్కులు ఇవేమి పట్టించుకోవడం లేదు.

ఉమ్మడి మండలంలో..

శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని వెంకటాపూర్, పాతపల్లి, తాటిపాముల, నాగరాల గుట్టల నుంచి మట్టి దందా జోరుగా కొనసాగుతుంది. అక్రమార్కుల ఇష్టారీతిగా గుట్టలను తవ్వుతూ తరలిస్తుండగా కొందరు యువకులు పట్టుకుని అధికారులకు అప్పగిస్తున్నారు. కానీ అధికారులు మాత్రం నిఘా ఏర్పాటు చేయడంలో విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. అలా ప్రకృతి సంపదను దోచుకుంటున్నా అధికారుల్లోచలనం రావట్లేదని మండిపడుతున్నారు. పకృతిని కాపాడాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చు చేసి హరితహారంలో భాగంగా మొక్కలను నాటుతుంటే అక్కమార్కులు మాత్రం మట్టిని తవ్వే నెపంతో వేల చెట్లను నేలకూల్చుతున్నారు. అయినా మండలంలో సంబంధిత అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

ప్రకృతి సంపద కాపాడాలి

అక్రమ మట్టి రవాణాను అరికట్టాలి. తాటిపాముల గుట్టల నుంచి విచ్చలవిడిగా మట్టి రవాణా అక్రమంగా చేస్తుండడంతో పాటు చెట్లను నేలకూల్చుతున్నారు. పృకృతి సంపద అక్రమంగా బయటకు తరలిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాములుయాదవ్, తాటిపాముల

జోరుగా దందా

మండలంలోని పలు ప్రాంతా ల నుంచి మట్టి అక్రమ దందా జోరుగా సాగుతుంది. గుట్టలోంచి మట్టి రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. అ నుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలి.

– విష్ణు, నాగరాల

చర్యలకు వెనకాడం

అక్రమ మట్టి రవాణాకు పాల్పడితే ఎంతటి వారైన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా మట్టి అక్రమ రవాణాను గుర్తిస్తే వెంటనే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వండి. వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

– మురళీగౌడ్, తహసీల్దార్, శ్రీరంగాపురం

ఘనంగా దత్తాత్రేయుడి కల్యాణోత్సవం



కొత్తకోటలోని దత్తాత్రేయ ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



ఆత్మకూర్‌లో దత్త యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని దత్తాత్రేయ ఆలయంలో మంగళవారం దత్తాత్రేయ కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ధూప దీప నైవేద్యం, మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి

ఆత్మకూర్: పట్టణంలోని సాయిబాబా మందిరం ఆవరణలోని దత్త ఆలయం వద్ద మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా దత్త జయంతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5.30గంటలకు సుప్రభాతం, 6గంటలకు కాగడ హారతి, 6.45కు శ్రీవిఘ్నేశ్వర, శ్రీనందీశ్వర, శ్రీదత్తాత్రేయ, శ్రీసంతాన నాగదేవత, శ్రీజోతిర్లింగ, శ్రీరామ్‌పరివార్, లక్ష్మీదేవి, షిర్డిసాయినాథులకు పంచామృతాభిషేకం, 9గంటలకు కావిడి ఉత్సవం, అర్చన, అష్టోత్తరం చేశారు. అనంతరం 10.30గంటలకు దత్త యజ్ఞం, 12గంటలకు హారతి, సాయంత్రం దూపహారతి, సాయిభజన, పల్లకీసేవ, సేజారతి కార్యక్రమాలు నిర్వహించారు. వర్తక సంఘం అధ్యక్షుడు ఏపూరి యాదగిరిశెట్టి, విజయలక్ష్మి, శివకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దివాన్జీ ప్రభాకర్ రావు, సంతోష్‌కుమార్, రమేష్‌శెట్టి, ముక్తేశ్వర్, రఘు, నవీన్, భక్తులు పాల్గొన్నారు.

చలాన్లపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: ట్రాఫిక్ ఈ చలాన్లపై పోలీస్ శాఖ కల్పించిన భారీ రాయితీని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వేణు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు పెండింగ్ చలాన్ల చెల్లింపులకు రాయితీ వర్తిస్తుందన్నారు. పెండింగ్ చలాన్లలో ఆర్టీసీ బస్సులకు 90 శాతం, ద్విచక్ర వాహనాలకు 80 శాతం, కార్లు, ఆటోలు ఇతర నాలుగు చక్రాల వాహనాలకు 60 శాతం, లారీ, ట్రక్కు, గూడ్స్ వాహనాలకు 50 శాతం రాయితీలు వర్తిస్తాయన్నారు. మండలంలో 6,443 పెండింగ్ చలాన్లు ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వాహనదారులు ఈ రాయితీలను సద్వినియోగం చేసుకొని తమ వాహనాల పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకోవాలని ఎస్ఐ సూచించారు.

అవయదానం గొప్పది

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లికి చెందిన నక్కల రాముడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందగా బ్రెయిన్ డెడ్ కావడంతో డాక్టర్ల సూచన మేరకు కుటుంబ సభ్యులు అవయవదానం చేశారు. విషయం తెలుసుకున్న మాజీ రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం కానాయపల్లికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నక్కల రాముడు అవయవదానం చేయడం గ్రామానికి గొప్ప పేరు వచ్చిందన్నారు. కార్యక్రమంలో యాదయ్యసాగర్, రావుల రఘువర్ధన్‌రెడ్డి, హోటల్ రాజు, నక్కల శాంతన్న, పి.వెంకటేశ్వర్లు, రాజు, రాముడు తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రావుల చంద్రశేఖర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి మండల పూజలు



నాభిశిల బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అమరచింత: పట్టణంలో మంగళవారం బొడ్రాయి మండల పూజా కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో బొడ్రాళ్లను 41 రోజుల కిందట ప్రతిష్ఠించారు. బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన జరిగి నేటికి మండలం రోజులు పూర్తి కావడంలో ఆయా వార్డుల్లోని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో హోమంతో పాటు కలశపూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయ ఆలయం వద్ద హోమం



బీసీ కాలనీలో బొడ్రాయి వద్ద పూజల్లో భక్తులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: మండల కేంద్రానికి చెందిన చాకలి పార్వతమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్ కుమారురెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అదించారు. వారి వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి ఉన్నారు.

ఏబీవీపీ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

అమరచింత: ఏబీవీపీ పట్టణ నూతన కన్వీనర్‌గా రాజేష్‌ను ఎన్నుకున్నట్లు మండల కన్వీనర్ అఖిల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పాఠశాల ఆవరణంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏబీవీపీ పట్టణ సెక్రెటరీగా బోర్ల భరత్, ఉపాధ్యక్షుడిగా తిరుమలేష్, కార్తీక్, జాయింట్ సెక్రెటరీలుగా లోకేష్, భరత్, కార్యవర్గ సభ్యులుగా అఖిల్, మహేష్, ఉదయ్, నారాయణలను నియమించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంతో పాటు విద్యా విధానంలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం

అమరచింత: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి సీటీ పేలిపోవడంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సబ్‌స్టేషన్‌లో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన ట్రాన్స్‌కో సిబ్బంది మంటలను సకాలంలో ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. మూడు నెలల కాలంలో రెండోసారి సీటీ కాలిపోవడం ఏమిటని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. టెక్నీషియన్ల లోపాలను గుర్తించి మరోమారు సీటీలు పేలిపోకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. దీంతో పట్టణంలో గంటపాటు విద్యుత్ అంతరాయం కలిగిందని, త్వరితంగా మరమ్మతు చేసి విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించామని ట్రాన్స్‌కో లైన్‌మెన్ రాజు తెలిపారు.



హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



వనపర్తి టౌన్: హాస్టళ్లలో స్వీపర్లు లేక విద్యార్థులే స్వీపర్లుగా మారి టాయిలెట్లు, మరుగుదొడ్లు, హాస్టల్‌ను శుభ్రపరుచుకుంటున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జగదీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని హాస్టళ్లు ఘోరమైన స్థితిలో ఉన్నాయని, సన్న బియ్యం ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా.. వాస్తవానికి విద్యార్థులకు దొడ్డు, మెరికల, పురుగుల బియ్యంతో చేసిన ఆహారం వడ్డిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు అలాంటి బియ్యం తిని అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సన్న బియ్యం ఇస్తున్నామన్న పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆహారం సరిగ్గా లేక రాష్ట్రంలో ప్రతీ రోజు ఏదో ఒక జిల్లాలోని హాస్టల్ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని, వారికి సరైన పౌష్టికాహారం అందించాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మామిడి తోటల సాగుపై రైతులకు సూచనలిస్తున్న ఎస్వీకే శాస్త్రవేత్త సురేష్

వీపనగండ్ల: మామిడి తోటలు పెంచే రైతులు ముందస్తు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వల్ల అధిక దిగుబడిని పొందవచ్చని ఎస్వీకే శాస్త్రవేత్త కె సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మన గ్రోమోర్, పెబ్బేరు వారు ఏర్పాటు చేసిన మామిడి రైతుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు మామిడిలో నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. చీడపీడల నివారణ కోసం సామూహిక చర్యలను తీసుకోవాలని సూచించారు. మామిడి తోటలకు అధిక నష్టాన్ని కలిగించే తేనెమంచు, నల్లతామర పురుగులు, పూత దశలో ఆశించే బూడిద తెగులు నివారణ కోసం ఎక్సోకోనాజోల్ మందును వాడాలన్నారు. అధిక రసాయన ఎరువులు వాడడం వల్ల తోటలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మార్కెటింగ్ మేనేజర్ కిషోర్, ఏరియా మేనేజర్ నరేష్, మన గ్రోమోర్ స్టోర్ మేనేజర్ సుబ్బారాయుడు, సర్పంచ్ నర్సింహారెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలి



రైతులకు ఆధునిక వ్యవసాయంపై డ్రోన్‌తో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూర్: అధిక దిగుబడుల కోసం రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని, పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ శరత్, వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ అబ్బాస్‌అలీ అన్నారు. మంగళవారం మండలంలోని తిప్డంపల్లిలో వికాసిత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఉచిత వైద్యం, జన్‌ధన్, సురక్ష, కిసాన్‌సమ్మాన్ యోజన, అటల్ పెన్షన్, ఆయుష్మాన్‌భారత్ తదితర పథకాల గురించి ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా అత్యాధునిక వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చన్న తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

గోపాల్‌పేట: యువకులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా చురుకుగా ఉండటంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం స్థానిక నాయకులతో కలిసి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రికెట్ టోర్నీలో మొత్తం 20 టీంలు పాల్గొంటాయని, మొదటి బహుమతి రూ.30,016, రెండో బహుమతి రూ.20,016 అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే మేఘారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు శివన్న, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్, నాగశేషి, చంద్రశేఖర్, బాలయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మదనాపురం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1993–94 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వపు విద్యార్థుల మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వపు విద్యార్థులతో పాటు స్నేహితులు అతిథులుగా హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. ప్రస్తుతం కుటుంబ విషయాలు చర్చించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు నాగన్న, సుమిత్ర, గోపాల్, సీతమ్మకు పూలమాల, శాలువాలతో సన్మానించి వారి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో మహేష్, కవిత, బాలరాజు, భాస్కర్, వెంకటేశ్వర్‌నాయక్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం



అమరచింతలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



పాన్‌గల్‌లో..



వనపర్తిలో..

సాక్షి, నెట్‌వర్క్: ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న సమస్యల సాధన కోసం ప్రజలు, రైతులు కలిసికట్టుగా మరో పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ అన్నారు. మంగళవారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపతూ ప్రజా పక్షాన పోరాటాలు చేస్తూ వారి సమస్యలను పరిష్కరించడంలో సీపీఐ పార్టీ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు రాజనగరం కృష్ణయ్య, దాసు, రాబర్ట్, అబ్రహం, సీఎస్ శెట్టి, మోష, భాస్కర్, కుతుబ్, లక్ష్మీనారాయణశెట్టి, భాస్కర్, శ్యాంసుందర్, ఎర్రన్న, కుర్మయ్య, పెద్ద హన్మంతు, సంతోష్, మల్లేష్ పాల్గొన్నారు.